## క్లుప్తంగా

### ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఎం.జె.వలస గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలు అందిస్తున్న దృశ్యం

రాజాం: గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచిన ఆధార్ స్పెషల్ డ్రైవ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఎం.జె.వలస గ్రామ సచివాలయంలోని ఆధార్ సేవలను ఆయన సోమవారం పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో విడతల వారీగా ఆధార్ సేవలు ఏర్పాటు చేస్తున్నామని, ఆధార్‌కార్డుల నమోదు, అప్‌డేట్ వంటివి చేయడం జరుగుతుందన్నారు.

### తహసీల్దార్‌గా ధర్మరాజు



ధర్మరాజు

వంగర: తహసీల్దార్‌గా డి.ధర్మరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన చిరంజీవి పడాల్ బదిలీపై వెళ్లడంతో నెల్లిమర్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ధర్మరాజును ఇక్కడికి బదిలీ చేశారు.

### వాహన తనిఖీలు



కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలి జంక్షన్‌లో పోలీసులు సోమవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది అటువైపుగా రాకపోకలు సాగించే వాహన దారులను ఆపి, వారి లైసెన్స్‌లు, వారి వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైనందు వల్ల అనుమానాస్పద వ్యక్తులు, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టిసారిస్తున్నామని సిబ్బంది తెలిపారు.

### సచివాలయ సేవలను విస్తృతం చేయాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను విస్తృతం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆగస్టు నెల పింఛన్లను మొదటిరోజే 99 శాతం మేర పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని ఈ నెల 31వ తేదీన రాజాం యాక్సిస్ బ్యాంకు ద్వారా విత్‌డ్రా చేసి సంబంధిత సచివాలయ సిబ్బందికి అందజేసి రసీదు పొందాలన్నారు. మండలంలో పింఛన్ల పంపిణీ పర్యవేక్షణకు తనతో పాటు మరో ఆరుగురిని నియమించారన్నారు.

### హిట్ అండ్ రన్ చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసరావు



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం: హిట్ అండ్ రన్ చేస్తే సంబంధిత వాహనదారుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండల కేంద్రంలో సీఐ తిరుమలరావుతో కలిసి ఆటోడ్రైవర్లతో సోమవారం సమావేశమైన ఆయన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించిన వారికి రివార్డు ఇస్తామన్నారు. వాహనదారులంతా తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. కేంద్రం నేర చట్టాలను కఠినతరం చేసిందని, మద్యం సేవించి గానీ నిర్లక్ష్యంగా గానీ వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. మైనర్లు వాహనం నడిపి, ప్రమాదానికి కారణమైతే సంబంధిత యజమానిపై కేసు నమోదు చేయడంతో పాటు జైలుశిక్ష విధించాల్సి ఉంటుందన్నారు. ప్రధాన రోడ్లలో వాహన రాకపోలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రోడ్డుపై ఆటోలు ఆపి, ప్రయాణికులను ఎక్కిస్తుండడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

# రుచి, శుచి కలిగిన ఆహారం అందివ్వాలి

- శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు శుభదిన భోజనాలు
- వంటకాలను తనిఖీ చేసిన మండల విద్యాశాఖాధికారులు
- ప్రతిరోజూ రుచికరమైన భోజనాలు అందివ్వాలని సూచన



తెర్లాం: భోజనాల కోసం క్యూలైన్‌లో ఉన్న విద్యార్థులు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచి, శుచి కలిగిన ఆహారం అందివ్వాలని ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి, పాఠశాల రికార్డులు, సిబ్బంది హాజరు, ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్నం ఏర్పాటు చేసిన శుభదిన భోజనంపై ఆరాతీశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేయాలని, కొంచెం వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు భోజనం వడ్డించాలని తెలిపారు.

రాజాం: పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో ఉన్న జ్ఞానజ్యోతి విద్యాలయాన్ని ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్ సోమవారం సందర్శించి, విద్యార్థుల హాజరు శాతంపై ఆరాతీశారు. ఒకరిద్దరు విద్యార్థుల ఆధార్ ప్రమోట్ తేడాలు గమనించి, సరిచేసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో చల్లా లక్ష్మణరావు సోమవారం సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను తనిఖీ చేశారు. పిల్లలకు రుచికరమైన భోజనం పెట్టాలని, వేడినీరు తాగేందుకు అందుబాటులో ఉంచాలన్నారు.

తెర్లాం: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుభదిన భోజనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జగన్నాధవలస గ్రామ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆయన ఎంఈవో త్రినాధరావు పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటకాలతో పాటు సర్పంచ్ గొండాల కుమారి, మామిడి రైతుల ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు జి.వెంకటరావులతో పాటు మరికొంత మంది దాతలు ఇచ్చిన ప్రత్యేక ఆహార పదార్థాలను విద్యార్థులకు వండిపెట్టడం జరిగిందని సిబ్బంది తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేయడమనేది సమానత్వం, ఐక్యత భావాలను పెంపొందించడమేనన్నారు.



రాజాం: శుభదిన భోజనం పంపిణీలో ఎంఈవో ప్రవీణ్‌కుమార్, తదితరులు

రేగిడి: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నశిర్లాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఏర్పాటు చేసిన శుభదిన/తిథి భోజనాలను ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు పరిశీలించారు. ప్రతిరోజూ విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.రోజారమణి, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: భోజనం ఎలా ఉందని విద్యార్థిని అడుగుతున్న ఎంఈవో లక్ష్మణరావు



రేగిడి: విద్యార్థులకు అందిస్తున్న శుభదిన భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని జె.రంగరాయపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనాలు పెట్టారు. సర్పంచ్ కునుకు రాధ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలు స్వీకరించి, పరిశీలిస్తున్న తహసీల్దార్ సులోచనరాణి, ఎంపీడీవో ఈశ్వరమ్మ

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సులోచనరాణి, ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. పలువురు సమర్పించిన అర్జీలను వారు తీసుకుని, పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో 90 శాతానికి పైగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల స్థాయిలో పరిష్కరించని సమస్యలను ఆర్‌డీవో దగ్గరకు, అక్కడ కూడా పరిష్కారం కాకపోతే కలెక్టర్ వద్దకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అధికారులు కూడా తమ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌సెల్) సోమవారం నిర్వహించారు. కార్యాలయ మేనేజర్ బి.ఎం.శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎవరూ ఎటువంటి అర్జీ సమర్పించేందుకు రాలేదు. దీంతో మధ్యాహ్నం ఒంటిగంటకే కార్యక్రమం ముగించారు.

## ఇంగ్లిష్‌పై భయం పోగొట్టేందుకు

# స్పెల్లింగ్ బీ పోటీలు దోహదం



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డెల్టా జిల్లా అధ్యక్షుడు విజయమోహనరావు

తెర్లాం: విద్యార్థుల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ పట్ల నెలకొన్న భయాన్ని పోగొట్టేందుకు స్పెల్లింగ్ బీ పోటీలు దోహదపడతాయని డెల్టా(జిల్లా ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం) అధ్యక్షుడు, నందబలగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ ఎం.విజయమోహనరావు అన్నారు. మండలంలోని నందబలగ గ్రామంలో ఇంగ్లిష్ స్పెల్లింగ్ బీ పోటీలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ పోటీలకు మొత్తం 96 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిని ఆరు గ్రూపులుగా విభజించి, ఆరు రౌండ్లలో ఇంగ్లిష్ పదాలకు సంబంధించి స్పెల్లింగ్‌లు అడగడంతో పాటు డిక్టేషన్(ఉక్తలేఖనం) పెట్టారు. ఈ పోటీల్లో అత్యధిక మార్కులు సాధించిన వి.సాత్విక్ అనే గ్రూపు సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంతవరకు ఎక్కడా ఇంగ్లిష్ స్పెల్లింగ్ బీ పోటీలు నిర్వహించలేదన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా ఇంగ్లిష్ పదాలు తెలియడంతో పాటు ఇంగ్లిష్ నేర్చుకోవడంపై మక్కువ ఏర్పడుతుందన్నారు.

# భగవద్గీత మోక్షప్రదాయిని



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత మోక్షప్రదాయిని అని, ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్.వి.రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతామందిరంలో సోమవారం నిర్వహించిన సత్సంగ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని తెలిపారు. మానవులంతా ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలంటే అందరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. ప్రజలకు సర్వ సంపదలు ఉన్నప్పటికీ శాంతి, ఆనందం కరువయ్యాయని, వాటిని పొందాలంటే నిత్యం భగవన్నామస్మరణ చేయాలన్నారు. కార్యక్రమంలో గొర్లె దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సమతా సైనిక్‌దళ్ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ



ఆర్.రామకృష్ణ

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన రెయ్యి రామకృష్ణ సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ఈ ఎన్నిక ఇటీవల విజయనగరంలో జరిగిందని ఆయన సోమవారం తెలిపారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు పి.మహేశ్వరరావు, పి.సురేంద్రబాబు, కమిటీ సభ్యులతో పాటు జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరావుకు కృతజ్ఞతలన్నారు.

### మహిళా ఉద్యోగులకు రక్షణగా వన్‌స్టాప్ కేంద్రాలు



సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న వన్‌స్టాప్ జిల్లా ప్రతినిధి అనిత

బొబ్బిలి రూరల్: మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించేందుకు వారు పనిచేసే ప్రతిచోటా వన్‌స్టాప్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వన్‌స్టాప్ కేంద్రం జిల్లా ప్రతినిధి టి.అనిత తెలిపారు. సోమవారం మండలంలోని పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు వన్‌స్టాప్ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ఆమె వివరించారు. లైంగిక వేధింపులు ఎదుర్కొన్నా, గృహహింసకు గురైనా ఈ కేంద్రాలను సంప్రదిస్తే తక్షణమే రక్షణ సాయం దొరుకుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళా ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనిప్రదేశంలో ఎటువంటి ఇబ్బందులకు గురైనా టోల్‌ఫ్రీ నంబర్ 181ను సంప్రదిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

### విద్యార్థి సంఘం ఎన్నికలు

బొబ్బిలి: పట్టణంలోని వేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి సంఘ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ప్రజాసామ్య పద్ధతిలో రహస్య బ్యాలెట్ ఓటు ద్వారా ఎన్నికలు చేపట్టగా, విద్యార్థులంతా ఓటింగ్‌లో పాల్గొని, సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. విద్యార్థులకు గుర్తుల కేటాయింపు దగ్గర నుంచి ఫలితాల వెల్లడి వరకు ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను ఎంఈవో గొట్టాపు వాసు పరిశీలించి, అభినందించారు.

### తాగునీటి సరఫరా పునరుద్ధరణ

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీ పరిధిలో ఉన్న బొడ్డవలస గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు సర్పంచ్ బుడుమూరు పట్టాభి సోమవారం తెలిపారు. జలజీవన్ మిషన్ పైపులైన్‌లు ఇటీవల మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన సర్పంచ్ పైపులైన్‌ల మరమ్మతులు చేయించి, ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు.

### పండ్లు, మిఠాయిల పంపిణీ

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్పందన అనే స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పండ్లు, మిఠాయిలు సోమవారం పంపిణీ చేశారు. వాటిని మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, తూముల యోగేంద్ర, చింత సాయి తదితరులు పాల్గొన్నారు.

### వితరణ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి సీబీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణదాస్ గ్రామంలోని 50 మంది నిరుపేద మహిళలకు సోమవారం చీరలు వితరణ చేశారు. నిరుపేదలైన మహిళలు, వృద్ధులకు తనవంతు సాయం చేస్తున్నానని, మరికొంతమంది దాతలు సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

# రాష్ట్రంలో ఆటవిక పాలన

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్

రాజాం: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రాజకీయ హత్యలు, దౌర్జన్యకాండలు, విధ్వంసాలు చూస్తుంటే రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతున్నట్లు అనిపిస్తోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జిడాక్టర్ తలే రాజేష్ అన్నారు. సోమవారం స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టకుండా, మరో మూడు నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళ్లిందన్నారు. రాష్ట్ర మొత్తం బడ్జెట్ ఎంత..?, అందులో ఆదాయ, వ్యయాలు ఎంత..? రాష్ట్రానికి ఉన్న రుణాలు మొత్తం ఎంత..?, ఏయే శాఖలకు ఎంత కేటాయించాలి?, ఏయే పథకాలకు ఎంత ఖర్చు చేయాలో అనే వివరాలు చెప్పాల్సి వస్తుందని చంద్రబాబు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఎత్తుగడ వేశారని విమర్శించారు. శ్వేతపత్రాల పేరుతో కాలయాపన చేస్తూ పథకాలను ఎగ్గొట్టే దిశగా చంద్రబాబు పావులు కదుపుతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో ఆయన అనుకూల మీడియాలో రాష్ట్రానికి రూ.14 లక్షల అప్పు ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేశారని, చివరకు గవర్నర్ ప్రసంగంలో కూడా రూ.10 లక్షలకు కుదించి చెప్పించారన్నారు. 2019లో తమ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర ఖజానాలో ఉన్నది కేవలం రూ.100 కోట్లేనని, అప్పట్లో జూలై 5వ తేదీనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. గత ఐదేళ్లలో రూ.2.71 లక్షల కోట్లను డీబీటీ ద్వారా వివక్ష లేకుండా అర్హులైన వారందరికీ ఇచ్చామన్నారు. లబ్ధి పొందిన వారిలో టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా ఉన్నారన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన సరిగ్గా 2 రోజుల ముందు కేంద్రం రాష్ట్రానికి డివల్యూషన్ ద్వారా రూ.5,655 కోట్లు ఇచ్చిందని, మొత్తంగా రూ.7 నుంచి 8 వేల కోట్లు అప్పటికే అందుబాటులో ఉన్నా బడ్జెట్ ప్రవేశపెట్టకపోవడం వెనక ఇచ్చిన హామీలు మోసగించే పన్నాగం ఉందని దుయ్యబట్టారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చలేని దుస్థితిలో చంద్రబాబు సర్కారు ఉందన్నారు. హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర బడ్జెట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలీదా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు ఇవ్వకపోగా మరోవైపు నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు ఎగబడుతున్నారని ధ్వజమెత్తారు. ముందు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టిసారించాలని హితవుపలికారు.

# మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



శిశువు ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న వైద్యాధికారిణి శిరీష

రామభద్రపురం: మాతాశిశు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వైద్యాధికారిణి ఎ.ఎల్.జి.శిరీష అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు పొందుతున్న మాతాశిశువులను ఆమె సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లల పుట్టుకలో ఏమైనా లోపాలున్నట్లు గుర్తిస్తే కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలకు గానీ, హయ్యర్ ఆస్పత్రికి గానీ తక్షణమే రిఫర్ చేస్తున్నామన్నారు. హిమోగ్లోబిన్ శాతం 8 కన్నా తక్కువ ఉన్న గర్భిణులకు ఇంజెక్షన్లు ఇస్తున్నామన్నారు. గర్భం దాల్చిన సమయంలో ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పౌష్టికాహారం అందించేలా చూస్తున్నామన్నారు. గర్భిణులు రక్తహీనత బారినపడకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలకు ఎక్కువ అవకాశం ఉంటుందని, వైద్యుల పర్యవేక్షణలో మాతాశిశువులు కూడా ఉంటారన్నారు.

వైద్యశిబిరం..

బొబ్బిలి రూరల్: మండలంలోని నిమ్మలపాడు గ్రామంలో జిల్లా లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 40 మందికి పిరిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.ఎస్.కె.రఘువంశీ వైద్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.వేలంగిరి, ఎంపీటీసీ కె.శివ, పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షిత మంచినీటిని అందించండి

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: వర్షాకాలం నేపథ్యంలో భూగర్భ జలం కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.ఎం.కె.రెడ్డి, ఏఈ పార్వతిలతో సోమవారం సమావేశమైన ఆయన.. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున నదులు, వాగులు, వంకలు ద్వారా చెరువులు, భూగర్భజలం కలుషితమవుతుందని, ఈ నీటిని తాగితే డయేరియా, ఇతర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. తాగునీరు కలుషితం కాకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని డీఈ తెలిపారు. ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేసేందుకు జాగ్రత్తలు కూడా తీసుకుంటున్నామన్నారు. ఎప్పటికప్పుడు మంచినీటి ట్యాంకులను శుభ్రపరచడంతో పాటు బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు. మంచినీటి పైపుల లీకులు లేకుండా చూస్తున్నామని, ఎక్కడైనా లీకులు ఉంటే మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



తెర్లాం: విజయరాంపురం వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ జల్లుతున్న వేతనదారులు



తెర్లాం: సతివాడలో వీధి కుళాయిల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు. ఎంపీడీవో బి.మధుసూదనరావు, ఈవోపీఆర్‌డీ నీలిమ ఆదేశాల మేరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. విజయరాంపురం, సతివాడ గ్రామాల్లోని కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ, రోడ్డుకు ఇరువైపులా, తాగునీటి బోర్లు వద్ద బ్లీచింగ్ చల్లే పనులు సోమవారం చేపట్టారు. అలాగే బోరు బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టారు.

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల వద్ద బ్లీచింగ్ చల్లడంతో పాటు గ్రామస్తులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యారోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి, తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: సంకిలి గ్రామ వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచ్ పట్టాభి

# వరినాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించండి



వరినారు శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి రూరల్: వరినాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు. మండలంలోని మెట్టవలస, పిరిడి, అలజంగి గ్రామాల్లో వరినాట్లు వేసే పద్ధతులపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పొలాలకు వెళ్లి, రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరినాట్లు వేయడానికి ముందు దానిని క్లోరిఫైపాస్ ద్రావణంతో శుద్ధి చేసుకోవాలని తెలిపారు. వరినారును శుద్ధి చేసుకోవడం ద్వారా నారుకు పట్టే పురుగు నశించి, పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్ల బెడద ఉండదన్నారు. వరినాట్లు వరుస క్రమంలో వేసుకోవాలని, నాట్లు నాటుకునే ముందు నారు చివర్లు తొలగించాలని తెలిపారు. మిల్లీలీటరు క్లోరిఫైపాస్ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి దానిలో వరినాట్లు అరగంట కాలం పాటు ఉంచాలని తెలిపారు.